క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి పుట్టినరోజు పూజలు



అయ్యప్ప స్వామి పూజలు చేస్తున్న రెజి కుమార్ నంబూద్రి

పార్వతీపురంటౌన్: కలియుగ ప్రత్యక్ష దైవం అయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకల ప్రత్యేక పూజా కార్యక్రమాలు పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. పూజలను శబరిమల మాలికాపురోత్తమ ఆలయ మున్‌మేల్ శాంతి వేదమూర్తులైన రెజికుమార్ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 6గంటలకు గణపతి హోమంతో ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 9 గంటలకు పడిపూజతో ముగిసింది. ప్రత్యేక వేద పండితులు అయ్యప్పకు క్షీరాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు నాగేశ్వరరావు, వై.సంతోష్, సుబ్రమ్మణ్యం, సన్నిధాన గురుస్వాములు గొట్టాపు వెంకటరమణ స్వామి పళ్లెం రాజు కర్రి ఫకీర్ స్వామి గంటా శ్రీను స్వామి సాయి స్వామి సింహాచలం స్వామి సత్యానందరావు స్వామి అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో బ్రిడ్జి పనులు చేయాలి



బ్రిడ్జి పనుల్లో నాణ్యతను పరిశీలిస్తున్న క్యూసీ ఎస్ఈ భాస్కరరావు

సీతానగరం: మండలకేంద్రం సీతానగరం వద్ద సువర్ణముఖినదిపై నిర్మాణం జరుగుతున్న ఆర్ అండ్‌బీ బ్రిడ్జి పనులు నాణ్యతాప్రమాణాలకు లోబడి ఉండాలని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ భాస్కరరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో జరుగుతున్న బ్రిడ్జి పనులను క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ భాస్కరరావు బ్రిడ్జి స్తంభాల నిర్మాణానికి ఉపయోగించే ముడిసరుకు, చేస్తున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎ. అప్పారావు, పార్వతీపురం డివిజన్ డీఈఈ ఎ.అప్పలరాజు, ఏఈఈ బి. రాజేంద్ర కుమార్, కాంట్రాక్ట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

బర్లి మహిళా ఫీల్డ్ అసిస్టెంట్‌పై దారుణంగా రాజకీయ

- ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాజకీయ వేధింపులతో విచారణ
- తప్పుచేయలేదని అధికారులకు చెప్పిన వేతనదారులు



దర్యాప్తు చేస్తున్న ఏపీడీ శ్రీహరి, అధికారులు

బలిజిపేట: మండలంలోని బర్లి మహిళా ఫీల్డ్ అసిస్టెంట్‌పై దర్యాప్తుల పేరున రాజకీయ వేధింపుల పరంపర కొనసాగిస్తున్నారు. లేనిపోని ఆరోపణలు లేవనెత్తి అధికారులపై ఒత్తిడి పెట్టి దర్యాప్తులు చేయిస్తున్నారు. గత సంవత్సరం నవంబరు నెల 27వ తేదీన ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవిపై ఉపాధి వేతనదారులు ఇచ్చిన ఫిర్యాదులపై అప్పటి ఎంపీడీఓ విజయలక్ష్మి దర్యాప్తు నిర్వహించారు. 42మంది వేతనదారులు స్థానికంగా ఉండడం లేదని, పని కల్పించడం లేదని, డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ సమయంలో 22మంది మాత్రమే హాజరయ్యారు. వారిలో కొంతమంది సక్రమంగా పనిచేస్తున్నారని, కొందరు డబ్బులు తీసుకుంటున్నారని విచారణ అధికారులకు తెలిపారు. వేరే వర్గం నుంచి 430మంది వేతనదారులు ఫీల్డ్ అసిస్టెంట్ సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారని, ఆమెవల్ల ఎటువంటి సమస్యలు తలెత్తడం లేదని విచారణ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు. మళ్లీ ఇప్పుడు కొత్త ఆరోపణలు లేకున్నా, పాత ఆరోపణలనే తవ్వుతూ ఏపీడీ శ్రీహరి బర్లి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తు సమయంలో అక్కడికి 182మంది హాజరవగా 161మంది ఫీల్డ్ అసిస్టెంట్ వల్ల ఎటువంటి పొరపాట్లు లేవని వాంగ్మూలం ఇచ్చారు. 21మంది వివిధ అంశాలపై ఆరోపించారు. పాత ఫిర్యాదులకు కొత్త తేదీలు వేసి దర్యాప్తునకు వచ్చారని, ఇవి రాజకీయ వేధింపులేనని పలువురు విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీఎస్ నగేష్, గ్రామపెద్దలు, వేతనదారులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన ప్రాంతాల్లోని నిరుపేదలైన ఎస్సీ, బీసీ, ఓసీలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఏజెన్సీ కాపు సంఘం అధ్యక్షుడు కొనిశ మన్మథ కోరారు. ఇదే విషయమై ఆయన కురుపాం మండలంలోని జి.శివడ రోడ్డులో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌కు హాజరైన మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. పక్కా ఇళ్లు లేకపోవడంతో ఎంతోమంది అర్హులైన నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి పీఎంఏవై పథకం కింద ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

- సచివాలయ సేవలకు స్వస్తి
- సిబ్బందితో వివిధ రకాల సర్వేలు

సర్వేలు ఫుల్.. సేవలు నిల్..!



చిలకలపల్లి సచివాలయం

బలిజిపేట: ప్రజలకు సత్వరమే సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటుచేసింది. అయితే వాటి సేవలకు నేడు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. గత ప్రభుత్వంలో సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ సేవలను పక్కన పెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటికీ తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అందకపోవడంతో తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీ సేవాకేంద్రాలు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

● **వివిధ రకాల సర్వేలు:**

సచివాలయం సిబ్బందిని సర్వేల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించాలి. పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ నమోదు వంటి ప్రక్రియ నిర్వహించాల్సి వస్తోంది. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో 18ఏళ్ల నుంచి 50ఏళ్లలోపు ఉన్న వారి జాబితాను చేయాల్సి ఉంటుంది. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యంతో పీ 4 సర్వే, నాన్ ఏపీ రెసిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలను చేయిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నా ఇంటి యజమాని సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పకపోతే చేసిన పని అంతా వృథా అవుతోంది. మళ్లీ మొదటి నుంచి సర్వే చేయాల్సి ఉంటుందని సచివాలయం సిబ్బంది వాపోతున్నారు.

● **సంక్షేమం ఊసేలేదు**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటుచేయడమే కాకుండా అందుకు తగిన సిబ్బందిని నియమించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. అప్పట్లో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందేవి. ఇప్పుడు కొత్త రేషన్ కార్డు కాని, పింఛన్ కాని రాకపోవడం దారుణంగా ఉంది.

ఉద్యోగులపై పనిఒత్తిడి

ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక ఉద్యోగి చొప్పున ప్రతి సచివాలయంలో 11మందిని నియమించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి క్యాస్ట్ సర్టిఫికెట్ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకు అన్ని సేవలను సచివాలయంలోనే అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సేవలకు స్వస్తి పలకడమే కాకుండా సచివాలయాల సిబ్బందిపై వివిధ రకాల సర్వేల పేరుతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సెలవు రోజుతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం, టార్గెట్లు పెట్టడం, మాతృశాఖ పనులతో పాటు బీఎల్‌ఓ విధులు ఇలా అన్ని రకాల పనులను చేయాలని ఆదేశిస్తున్నారు. దీంతో వారంతా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సర్వేల కోసం సచివాలయాల ఉద్యోగులు వీధివీధినా తిరుగడంతో సచివాలయాలు సిబ్బంది లేక వెలవెలబోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు విధి నిర్వహణ

ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ప్రతి ఉద్యోగి వారి విధులను నిర్వహించాల్సి ఉంటుంది. అందులో భాగంగా సచివాలయ సిబ్బంది సర్వేలు చేస్తున్నారు. ప్రజలందరికీ అందరికీ అన్ని సేవలను అందిస్తున్నాం.

ఏవీఎస్ నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

మరిపివలస పాఠశాలలో విద్యార్థులు చేరాలి

● పేరెంట్స్‌తో ఉపాధ్యాయుల సమావేశం



పేరెంట్స్‌తో మాట్లాడుతున్న హెచ్‌ఎం వి. తవిటినాయుడు

సీతానగరం: మండలంలో మౌలిక సదుపాయాలున్న మరిపివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేరాలని హెచ్‌ఎం వి.తవిటినాయుడు కోరారు. ఈ మేరకు సాలూరు మండలంలోని కందులపదం, పావడవలస, కరాసవలస, కొత్తవలస మామిడి, మామిడి గ్రామాల పేరెంట్స్‌తో ఉపాధ్యాయులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తవిటినాయుడు మాట్లాడుతూ జాతీయరహదారిని ఆనుకుని మరిపివలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఉందని పాఠశాలను ఆనుకుని బాలికల వసతిగృహం ఉందన్నారు. విద్యార్థులకు విద్యాబోధనకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయన్న విషయాన్ని పేరెంట్స్ తెలుసుకుని పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం పేరెంట్స్ మాట్లాడుతూ తమ పిల్లలను ఈ నెల 21న చేర్పించడానికి దరఖాస్తు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ అనసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దుచేసి కరెంట్ చార్జీలు తగ్గించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

బలిజిపేట: స్మార్ట్ మీటర్లు రద్దుచేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బలిజిపేట ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఎం నాయకులు శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బి.భానుమూర్తి, నల్ల ఈశ్వరరావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని చెప్పి ప్రజలను నమ్మించి నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకుల పెరుగుదల, గ్యాస్ ధర పెంపు, స్మార్ట్ మీటర్లతో సెల్‌ఫోన్ రీచార్జ్‌లా స్మార్ట్ కరెంట్ మీటర్లు ఏర్పాటు చేసి ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. ఆర్థిక భారంతో ప్రజలు సతమతమవుతున్నారని, ఇది చాలా దుర్మార్గమని, ఇంతటి దారుణమైన పాలన సాగించడం నిరుపేద ప్రజలను పట్టిపీడించడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రూ ఆప్ చార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందాలను రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు జి.సత్యనారాయణ, మండల నాయకుడు మన్మథరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

కార్పొరేట్ రంగాలకు ప్రభుత్వాల వత్తాసు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

పార్వతీపురం: ఆర్థిక, వ్యవసాయ సరళీకృత విధానాల పేరుతో కార్పొరేట్ రంగాలకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో చట్టాలను మార్పు చేస్తూ అదానీ, అంబానీ వంటి బహుళ జాతి సంస్థలకు ఊడిగం చేసేందుకు రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, వాటిని రద్దు చేసేందుకు 13నెలల పాటు 540 సంఘాలతో ఉద్యమం చేయాల్సి వచ్చిందన్నారు. రైతులకు ఉపయోగకరమైన సహకార, మార్కెటింగ్ వ్యవస్థను బహుళ జాతి కంపెనీలకు అప్పజెప్పేందుకు సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం చర్యలపై ఏఐకేఎస్ 30వ జాతీయ మహాసభలో కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈవీ నాయుడు, తోటజీవన్, గరుగుబిల్లి సూరయ్య, బీటీ నాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రదేశంలో మంచి నీటి సౌకర్యానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని ప్రజలకు ఉపాధి పనులు కల్పించడం, తాగునీరు సౌకర్యం కల్పించడానికి సంబంధిత శాఖ సిబ్బంది సిద్ధం కావాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని చెల్లన్నాయుడువలస చెరువుల్లో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించి వేతనదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. గ్రామంలోని వేతనదారులు సమయపాలన పాటించాలని, గ్రామసభల్లో ఎంపికచేసిన పనులను క్రమపద్ధతిలో చేయాలని సూచించారు. అలాగే తనపర్యటనలో గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రజలు అడుగుతున్న సమస్యలను సంబంధిత అధికార సిబ్బందితో చర్చించి పరిష్కరించడానికి సత్వర చర్యలుతీసుకుంటున్నామన్నారు. దీనిపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో నెలకు 1,000 గృహాలు పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించామని, కనీసం 500 గృహాలైనా పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మే నెలలోగా 1600 గృహాలు పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ప్రతి మండలంలో వారానికి 100 గృహాలు పూర్తయితే గాని అనుకున్న లక్ష్యాన్ని సాధించలేరన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పలు అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద లబ్ధిదారులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో తహసీల్దార్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ఇలా కొనసాగితే ఉపేక్షించబోమన్నారు. మంగళవారం నాటికి లబ్ధిదారులకు అవసరమైన పత్రాలను తహసీల్దార్లు మంజూరుచేయాలని పేర్కొన్నారు.

నీరు అందని గ్రామాలు ఉండరాదు

వేసవి దష్ట్యా జిల్లాలో ఎక్కడా నీరు అందని గ్రామాలు ఉండరాదని, సమస్యలు రాక మునుపే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి సమస్యలపై వివిధ పత్రికల్లో వస్తున్న వార్తలపై తక్షణమే స్పందించాలని, సమస్య వచ్చిన తదుపరి పరిష్కరించే కన్నా, ముందే ఆ సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.

జిల్లాలో 950 హైరిస్క్ గ్రామాలు

జిల్లాలో 950 గ్రామాలు హైరిస్క్ గ్రామాలుగా ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారని, ఆయా గ్రామాల్లో దశల వారీగా స్ప్రేయింగ్ ప్రారంభించనున్నామన్నారు. మే 1వ తేదీ నుంచి తొలి దశ స్ప్రేయింగ్ ప్రారంభం కానుందని, ముఖ్యంగా జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, పాచిపెంట, సీతంపేట మండలాల్లోని గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయించాల్సి ఉందన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.విజయ్ స్వరూప్, డీఎల్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ సంస్థ డీఈఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి

జ్యోతిరావుపూలే



పూలేకు నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత దేశ ఆధునిక వైతాళికుడు, దేశ ప్రప్రథమ సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని తన గృహంలో జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు,దండిశ్రీనివాసరావు, ఈశ్వరరావు, మధుసూదనరావు,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలేకు నివాళులు

పార్వతీపురంటౌన్: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని పార్వతీపురం నియోజకవర్గం కేంద్రంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి బోను ఆదినారాయణ, కౌన్సిలర్‌లు నిమ్మకాయల సుధీర్, ఎడ్ల తినాథ, జిల్లా నియోజకవర్గాల పార్టీల వివిధ విభాగాల అధ్యక్షులు పాతగౌరీశంకర్, కోల సుధాకర్, హరికృష్ణ రాజు, కోరాడ శేఖర్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, పట్టణ పార్టీ ప్రజాప్రతినిధులు చందాన అనంద్, ఆకుల శ్రీనివాసరావు, బుగత రాజు, సువ్వాడ శ్రీనివాసరావు, భాస్కరరావు, చంద్ర సందీప్, అనిల్, రాంబాబు, దుర్గ, వివిధ బీసీకుల సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

రహదారికి మోక్షమెప్పుడో..?



అసంపూర్తిగా నిలిచిపోయిన తేలునాయుడువలస-గంజిగెడ్డ రోడ్డు

గిరిజన గ్రామాలపై చిన్నచూపు..



రహదారి నిర్మించాలని పలుమార్లు గ్రీవెన్స్‌సెల్‌లో విన్నవించుకున్నప్పటికీ అధికారుల స్పందన కరువైంది. గిరిజన గ్రామాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాకపోకలు చేసేందుకు నిత్యం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులకు కనిపించకపోవడం శోచనీయం.

– పి. రాము, సీపీఎం నాయకుడు

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల పంచాయతీ తేలునాయుడువలస నుంచి గంజిగెడ్డ గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించాల్సి ఉండగా నేటికీ ఆ రహదారి నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఆ రహదారిని ఆనుకుని ఉన్న ఐదు గ్రామాల గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో ఐదు కిలోమీటర్ల మేర రహదారిపై ఐదు చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా గతంలో కల్వర్టుల నిర్మాణం కోసం రహదారి మధ్యలో ఐదు చోట్ల తవ్వకాలు జరిపి ఐదు కల్వర్టులకు రెండువైపులా చిన్నపాటి గోడలు నిర్మిస్తుండగా అర్ధాంతరంగా ప్రాథమిక దశలోనే పనులు నిలిచిపోయాయి. దీంతో రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. రేషన్‌కు, అత్యవసరాలకు, విద్యార్థులు, వ్యక్తిగత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చేవారు రాకపోకలు చేసేందుకు నిత్యం అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే రాకపోకలకు ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయి.



గతంలో రోడ్డు నిర్మాణం కోసం చదునుచేస్తున్న జేసీబీ (ఫైల్)

చిన్నతరహా సాగునీటి వనరుల గణన చేపట్టాలి



వీఆర్‌వోలకు సూచనలిస్తున్న ఏఎస్‌వో చిన్నారావు

జియ్యమ్మవలస రూరల్: చిన్నతరహా సాగునీటి వనరుల గణన చేపట్టాలని ఏఎస్‌వో(సహాయ గణాంకాధికారి) కొల్లా చిన్నారావు సూచించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రెడ్డి పకీరు అధ్యక్షతన వీఆర్‌వోలతో శుక్రవారం సమావేశమయ్యారు. మండలంలోని 31 పంచాయతీలకు సంబంధించి సాగునీటి వనరులు, వాటి వివరాలను సేకరించాలని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎన్ని ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందో.. విద్యుత్ మోటార్ల ద్వారా రైతులు ఎన్ని ఎకరాల భూమిని సాగు చేస్తున్నారోనన్న వివరాలు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు.